క్లుప్తంగా

కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న వాసుపల్లి



అమ్మవారికి పూజలు చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : మాజీ ఎమ్మెల్యే, నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం కనకమహాలక్ష్మిని దర్శించుకున్నారు. శ్రావణ మాసం రెండో శుక్రవారం, వరలక్ష్మీవ్రతం కావడంతో అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ వర్గాలు వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు.

మాదక ద్రవ్యాల నియంత్రణపై నేడు సదస్సు

మహారాణిపేట: మాదక ద్రవ్యాల నియంత్రణపై శనివారం జీవీఎంసీ జోనల్ 4 కార్యాలయం సమావేశ మందిరంలో మధ్యాహ్నం రెండు గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. జిల్లాకు చెందిన రిటైల్ కెమిస్ట్‌లు, డ్రగిస్ట్‌ల పాత్రపై ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, విశాఖ జిల్లా డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో అంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, జిల్లా ఔషధ నియంత్రణాధికారులతో పాటు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

లాడ్జిలు, హోటళ్లలో విస్తృత తనిఖీలు



లాడ్జీలో బ్యాగులను తనిఖీ చేస్తున్న పోలీసులు

అల్లిపురం: పోలీసులు శుక్రవారం తెల్లవారు జాము నుంచి నగరాన్ని జల్లెడపట్టారు. ఇంటిలిజెన్స్ వర్గాలు హెచ్చరించడంతో నగర పోలీస్ కమిషనర్ డాక్టర శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు 80 ప్రత్యేక బృందాలతో నగరంలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో గల 121 లాడ్జీలను 400కు పైగా సిబ్బందితో తనిఖీలు చేపట్టారు.

శుక్రవారం ఉదయం 6.30 గంటల నుంచి జేసీపీ ఫకీరప్ప పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహించారు. హోటల్, లాడ్జీల రికార్డులను పోలీసులు పరిశీలించారు. హోటల్స్‌లో పనిచేసే సిబ్బంది వివరాలు, గెస్ట్‌ల వివరాలు తెలుసుకున్నారు. లాడ్జీలలో తనిఖీ చేయగా 10 కిలోల గంజాయి, 9 బీరు బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదు చేశారు. నిబంధనలు పాటించని హోటల్స్, లాడ్జీలపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. తప్పనిసరిగా సీసీ కెమెరాల 30 రోజులు బ్యాకప్ ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానితులు ఎవరైనా కనిపిస్తే తక్షణమే 7995095799 నంబరుకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

వరలక్ష్మీ.. నమోస్తుతే

శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా జరిగాయి. మహిళలు పెద్ద ఎత్తున పూజలు చేసి ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చారు. పళ్లు, ఫలహారాలతో వరలక్ష్మి అమ్మవారిని పూజించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. వేకువ జాము నుంచీ ఆలయాలు భక్తులతో కళకళలాడాయి.

- భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు
- కిటకిటలాడిన అమ్మవార్ల ఆలయాలు



విశేష అలంకరణలో బల్లిగిరి వెంకన్న

అల్లిపురం : రెండవ శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా నియోజకవర్గంలో అమ్మవారి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవార్లకు తెల్లవారు జాము నుంచే భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల అర్చకులు అమ్మవార్లకు విశేష అభిషేకాలు చేశారు. అస్సాం గార్డెన్స్, నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవాలయం, మూడుగుళ్ల కనకదుర్గమ్మ ఆలయం, వెంకటేశ్వరమెట్ట శ్రీ అలమేలు మంగమ్మ ఆలయం, బల్లిగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం, కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం, జెండా చెట్టువీధి విజయదుర్గాలమ్మ అమ్మవారి దేవాలయాల్లో అమ్మవారికి అర్చకులు విశేష పూజలు చేశారు. ప్రతి ఇంట్లో మహిళలు అమ్మవారిని వారి శక్తి కొద్దీ అలంకరించారు. పిండి వంటలు తయారు చేసి అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజించుకున్నారు.



విశేష అలంకరణలో నీలమ్మ వేపచెట్టు అమ్మవారు

మహిళలకు వాయినాలు ఇస్తూ ప్రతి ఇల్లు సందడిగా మారింది.

పూల అలంకరణలో ఉమాదేవి..

శ్రావణ శుక్రవారం సందర్భంగా టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ఉమాదేవి అమ్మవారిని ఆలయ అర్చకుడు భార్గవ శర్మ రంగురంగుల పూలు, కరెన్సీ నోట్లతో చూడచక్కగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నిమ్మకాయ డొప్పలతో నేతి దీపాలు వెలిగించి అమ్మవారికి నివేదించారు. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో లలితా పారాయణం అనంతరం ఏక హారతి నుంచి నక్షత్ర హారతులతో ఆలయం మార్మోగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బల్లిగిరి వెంకన్నకు ప్రత్యేక అభిషేకాలు

శ్రావణ మాసం రెండవ శుక్రవారం, ఏకాదశి సందర్భంగా బల్లిగిరి వేంకటేశ్వరస్వామికి ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు పంచామృతాలతో



బల్లిగిరి ఆలయంలో విశేష అలంకరణలో పద్మావతి అమ్మవారు

ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అలమేలు మంగమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు..

డాబాగార్డెన్స్ : భారతదేశం సంస్కృతీ సాంప్రదాయాలకు పుట్టినిల్లు. తరతరాలుగా వస్తున్న సాంప్రదాయాలను తూచ తప్పకుండా పాటిస్తూ వస్తున్నారు. ముఖ్యంగా శ్రావణలక్ష్మి పూజల రోజున పలువురు ముత్తయిదువులకు పసుపు, చందనం రాయడమే కాక బలదానం ఇవ్వడం ప్రతీక. కనక మహాలక్ష్మీ దేవాలయంలో రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీ వ్రతం నిర్వహించిన వేళ.. పలువురు మహిళలు శ్రావణలక్ష్మీ పూజలు చేశారు. దీంతో ఆలయం ఆధ్యాత్మికతతో కళకళలాడింది.



విశేష అలంకరణలో శ్రీ ఉమాదేవి



మహిళకు పసుపు, చందనం రాస్తున్న దృశ్యం

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్-3, జోన్-4 పరిధి పలు ప్రాంతాల్లో శనివారం తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీరు కేవీఎన్ రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవీఎంసీ టీఎస్ఆర్ నుంచి హైలెవల్ రిజర్వాయర్‌కి మంచినీటిని సరఫరా చేసే 400 ఎంఎం డయా సీఐ పైపులైన్ మరమ్మతులకు గురైనందున, మరమతులు చేసే విషయమై శనివారం ఆయా జోన్ల పరిధి పలు ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని చెప్పారు.

తాగునీటికి అంతరాయం ఏర్పడే ప్రాంతాలివే..

20వ వార్డు ఈస్ట్‌పాయింట్ కాలనీ, పెదవాల్తేర్, 21వ వార్డు మహిళ వీధి, విద్యానగర్ కాలనీ, రెల్లివీధి, ఏయూ అవుట్‌గేట్ డౌన్, ఓల్డ్ సీబీఐ డౌన్, మైత్రీనగర్, వినాయఘర్ అపార్టుమెంట్స్, స్విమ్మింగ్ పూల్ ఏరియా, పాండురంగాపురం, బీచ్‌రోడ్డు సబ్‌మెరైన్, ఓషన్ వ్యూ లేఅవుట్ ఏరియా, చినవాల్తేర్ ఏరియా, 22వ వార్డులో బాలాజీనగర్, టైమ్స్ ఆఫ్ ఇండియా, సిద్ధార్థనగర్, 24వ వార్డులో పాత రేసపువానిపాలెం, వినాయకనగర్, తులసిపేట, స్వర్ణభారతి స్టేడియం ఏరియా, 27వ వార్డులో అశోక్‌నగర్, రామాటాకీస్ రోడ్డు, శ్రీనగర్, బుదిల్‌పార్క్ రోడ్డు, రెడ్డి ఆస్పత్రి రోడ్డు, శ్రీనగర్ సాయిబాబా టెంపుల్ రోడ్డు, ద్వారకానగర్ రోడ్డు నంబరు 1 నుంచి 6వ లేన్ వరకు, అమర్‌నగర్ చర్చి రోడ్డు, సీబీఎం కాంపౌండ్, రామాటాకీస్ లేడీస్ గేట్ బుకింగ్ రోడ్డు, 28వ వార్డులో ఫేకర్ లే అవుట్, కైలాసమెట్ట, రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుంది. ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేయనున్నట్టు పర్యవేక్షక ఇంజినీర్ తెలిపారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి



లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాసుదేవరావు

డాబాగార్డెన్స్ : సర్దార్ గౌతు లచ్చన్న పేదల పాలిట పెన్నిధి అని, పలాస జిల్లాకు ఆయన పేరు పెట్టాలని శ్రీశయన సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు తోట వాసుదేవరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గౌతులచ్చన్న 115వ జయంతి సందర్భంగా శుక్రవారం జడ్జి కోర్టు సమీపాన గల ఆయన విగ్రహానికి ఆయనతో పాటు పలువురు నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాసుదేవరావు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు కానున్న పలాస జిల్లాకు లచ్చన్న పేరు పెట్టాలన్నారు. అలాగే విశాఖలో అక్కిరెడ్డిపాలెం-అగనంపూడికి వెళ్లే మార్గంలో గౌతులచ్చన్న భారీ విగ్రహం ఏర్పాటు చేయాలని, లచ్చన్న స్మారక పార్కు నిర్మాణానికి ప్రభుత్వం 5 ఎకరాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి లచ్చన్న ఎనలేని సేవలందించారని, స్వాతంత్ర్య సమరయోధుడిగా బ్రిటిష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారన్నారు. బడుగు, బలహీన వర్గాలు, అల్పాదాయ వర్గాలకు లచ్చన్న ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి బంటుపల్లి కృష్ణ, చిట్టిబాబు, గిరి జోగారావు, ఎం. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


అలరించిన సంగీత కచేరీ



సంగీత కచేరీ నిర్వహిస్తున్న కళాకారులు

మహారాణిపేట : జిల్లా పరిషత్ దరి శ్రీ కృష్ణ చైతన్య మఠంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా శుక్రవారం ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఆధ్వర్యంలో కచేరీ నిర్వహించారు. సంగీత శిక్షకుడు ఆకొండి వెంకటరావు ఆధ్వర్యంలో పలువురు లలిత సంగీతం, ఆధ్యాత్మిక గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి జగన్మోహనరావు, కోశాధికారి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

'మైనారిటీ సమితి' జిల్లా అధ్యక్షుడిగా అస్లం ఖాన్



అస్లం ఖాన్‌ను అభినందిస్తున్న సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఫారుఖ్ షుబ్లీ

సీతమ్మధార: రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా 14వ వార్డు సీతమ్మధారకు చెందిన మహ్మద్ అస్లం ఖాన్ నియమితుడయ్యారు. సీతమ్మధారలోని ఒక హోటల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ ఫారుఖీ షుబ్లీ ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో విశాఖలోని అన్ని నియోజకవర్గాలకు కొత్తగా అధ్యక్షులను నియమిస్తామని తెలిపారు. మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమితి నిరంతరం కృషి చేస్తోందన్నారు. అస్లం ఖాన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎంతో గౌరవ ప్రదమైన పదవిని కేటాయించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఫారుఖ్ షుబ్లీ, ముస్లిం పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విజ్ఞానానికి వేదికలు గ్రంథాలయాలు



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఆచార్య జీఎస్ఎన్ రాజు

అల్లిపురం : గ్రంథాలయాలు విజ్ఞానానికి వేదికలని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు అన్నారు. వెంకటేశ్వరమెట్టపై గల శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయంలో గ్రంథాలయం పునః ప్రారంభ కార్యక్రమంలో ఆయనతో పాటు 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా కొంత సమయాన్ని గ్రంథాలయంలో గడపాలన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులు పాలమరశెట్టి శ్యామ్, పాలమరశెట్టి శ్రీను, కోశాధికారి నర్సింగరావు, భీశెట్టి గోపీకృష్ణ, కార్యవర్గ సభ్యులు శరగడం భాస్కర్, మోహన్, బాబాజీ, సన్యాసిరావు, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ వైద్యులకు మద్దతు

- నేడు ప్రభుత్వ వైద్యుల నిరసన

మహారాణిపేట : దేశం యావత్తు తలదించుకునేలా ఒక పీజీ డాక్టర్‌పై జరిగిన అరాచకత్వాన్ని తీవ్రంగా ఖండిస్తూ దేశవ్యాప్త జూనియర్ డాక్టర్ల ఆందోళనకు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ సంఘీభావం తెలియజేస్తుందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిడకల శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. అలాగే జూనియర్ డాక్టర్ల ఉద్యమానికి సంఘీభావం తెలియజేస్తూ నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరు కావాలన్నారు. దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు, పీజీ విద్యార్థులు, డాక్టర్లు అత్యవసర పరిస్థితిని కూడా బహిష్కరించి ఉద్యమం చేస్తున్న వేళ ప్రభుత్వ డాక్టర్లు ఎటువంటి ఆందోళనలు చేయకుండా పేద రోగుల చికిత్సకు పూర్తిగా సహకరించాలని అసోసియేషన్ రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. తమ అసోసియేషన్‌తో సంబంధం లేని కొంత మంది వ్యక్తులు ఉనికి కోసం ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ పేరుతో బాధ్యతారాహిత్యంగా గంట పాటు విధులు బహిష్కరించి ధర్నా చేయాలని పిలుపునివ్వడం చట్టరీత్యా నేరమని, అలా పిలుపునిచ్చిన వారిపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య



అనూష మృతదేహం

గోపాలపట్నం: క్షణికావేశంలో బుచ్చిరాజుపాలెం దరి సీతారామరాజునగర్‌లో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. పి. అనూష(25) సీతారామరాజునగర్‌లో కుటుంబంతో నివాసముంటోంది. భర్త చెన్నైలో మేకప్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పిల్లలను అత్త కోసం టిఫిన్ తీసుకు రమ్మని పంపించింది. అయితే పిల్లలు వచ్చే సరికి ఫ్యాన్ హుక్కుకు ఉరి వేసుకుని మృతి చెందింది. స్థానికులు డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారమివ్వడంతో ఘటనా స్థలానికి ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు చేరుకుని వివరాలు సేకరించారు.

రూ. 90 వేల కోసం ..

మృతురాలి వద్ద సూసైడ్ నోట్ లభ్యమయింది. అత్తకు తెలియకుండా ఆమె ఖాతాలో రూ.90 వేలు వాడేశాను.. భర్త పలాసలో వివాహానికి హాజరయ్యేందుకు వస్తున్నారు.. డబ్బు గురించి అడిగితే సమాధానం చెప్పుకోలేను.. పిల్లలను నా తమ్ముడు చూసుకుంటాడు. నా చావుకు ఎవరూ కారణం కాదని లేఖలో పేర్కొంది.

భర్త ఇంటికి చేరుకునే లోగా శవమై..

మరో అరగంటలో భర్త వెంకటరమణ ఇంటికి చేరుకుంటాడన్న సమయానికి భార్య ఆత్మహత్య చేసుకోవడంతో లబోదిబోమని విలపించారు. నాన్నతో కలసి పెళ్లికి వెళ్దామని పిల్లలను ఉదయాన్నే లేపి వేగంగా తయారు కావాలని చెప్పింది. నానమ్మకూడా వస్తుంది. ఆమెకు టిఫిన్ తీసుకు రావాలని పంపింది. ఇంతలో పిల్లలను అనాథలు చేసే నిర్ణయం తీసుకుందని బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతురాలికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ప్రయివేటు పాఠశాలలో 1వ తరగతి, 5వ తరగతి చదువుతున్నారు. భర్త వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ చక్రధరరావు పర్యవేక్షణలో హెచ్‌సీ శివసాగర్ దర్యాప్తు చేపట్టారు. మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

పోలీస్ క్వార్టర్స్ అభివృద్ధి

ప్రారంభించిన సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి



అల్లిపురం పోలీస్ క్వార్టర్స్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ బాగ్చి

అల్లిపురం : గత నెలలో అల్లిపురం పోలీస్ క్వార్టర్స్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ కుటుంబాలు ఆయనకు క్వార్టర్స్ నిర్వహణ నిమిత్తం ఒక పీసీ లేదా హోంగార్డును నియమించాలని కోరారు. ప్రత్యేకంగా త్రిశూల్ బ్లాక్‌పైన లీకేజీ, పోలీస్ క్వార్టర్స్ చుట్టుపక్కల పొదలు తొలగించమని, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచాలని, తక్కువగా ఉన్న లైటింగ్‌ను పెంచాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, డక్ట్ ఏరియాలను మూసివేయాలని కోరారు. దీనికి స్పందించిన సీపీ పనులను సకాలంలో పూర్తి చేయించి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ క్వార్టర్స్‌లో నివసిస్తున్న కుటుంబ సభ్యులందరూ సీపీకి పూలతో స్వాగతం పలికారు. థ్యాంక్యూ సీపీ సార్ అంటూ నినదించారు. పోలీస్ క్వార్టర్స్‌కు హోమ్ గార్డును నియమించడమే కాకుండా, పోలీస్ క్వార్టర్స్‌లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. దీర్ఘకాలం అనారోగ్యంతో ఉన్న కుటుంబాలకు దిగువ క్వార్టర్స్ కేటాయించాలని, కుటుంబ సభ్యులకు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీసు కుటుంబ సభ్యులకు సమస్యలు ఉంటే తక్షణమే తనకు 7995095799 ఫోన్ నంబర్‌లో తెలియజేయాలని సీపీ తెలిపారు.



పోలీసు కుటుంబ సభ్యులతో ముచ్చటిస్తున్న సీపీ

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



ప్రశంసా పత్రం అందుకుంటున్న ఉమా మహేశ్వరి

విశాఖ విద్య: జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కొత్తపాలెం జెడ్పీ హైస్కూల్ పదో తరగతి చదువుతున్న ఎం. ఉమా మహేశ్వరి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ హరేందిర ప్రసాద్ చేతుల మీదగా ఉమా మహేశ్వరి ప్రశంసా పత్రం, మెమోంటో అందుకుంది. విద్యార్థినికి తోడ్పాటు అందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. రత్నమా

మైనింగ్ తవ్వకాలతో తీరని నష్టం

- ప్రభుత్వం తన నిర్ణయం వెనక్కి తీసుకోవాలి
- సీపీఎం కార్పొరేటర్ పాదయాత్ర ప్రారంభం



కుసులవాడలో పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

తగరపువలస: ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ పరిధిలో చిన్నయ్యపాలెం గ్రామాన్ని ఆనుకుని సర్వే నంబర్ 104 కొండపై మైనింగ్‌కు సిద్ధపడిన ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని 78వ వార్డు సీపీఎం కార్పొరేటర్ డాక్టర్ గంగారావు డిమాండ్ చేశారు. మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ పంచాయతీలో శుక్రవారం ఆయన పాదయాత్ర ప్రారంభించారు. వి.ఆర్.ఇన్‌ఫ్రా టెక్నాలజీ సంస్థ చేపట్టనున్న మైనింగ్ కారణంగా కుసులవాడ ఎస్సీ కాలనీ, గొల్లలపాలెం, చిన్నయ్యపాలెం, రేగానిగూడెం, ఇచ్ఛాపురం, పందలపాక, బాకూరుపాలెం, జగన్నాథపుర గ్రామాలన్నీ విష ప్రభావానికి లోనవుతాయన్నారు. దుమ్ము, ధూళి కారణంగా ఐదు కిలోమీటర్ల పరిధిలో గాలి, నీరు, పంటపొలాలు నాశనం అవుతాయన్నారు. వరి, మామిడి, జీడి, కూరగాయలు, పువ్వుల పంటలు దెబ్బతింటాయన్నారు. కొండ చుట్టు పక్కల గ్రామాల ప్రజలంతా మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ ఈ నెల 28న జరుగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో వినతులు అందజేయాలన్నారు. పాదయాత్రలో భీమిలి జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి, కమిటీ సభ్యులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, వాళ్ల నాగరాజు, డీవైఎఫ్ఐ నాయకుడు శిరువూరి శ్రీనివాసవర్మ, ప్రజానాట్య మండలి ప్రతినిధి పంపాన సూర్యనారాయణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం



సీసీ కెమెరాలో నమోదైన మృతుడి చిత్రం

తగరపువలస : ఆనందపురం మండలం గండిగుండం పంచాయతీ పరిధిలో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని 25 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన యువకుడి మృతదేహాన్ని వీఆర్వో మంగరాజు, వీఆర్ఏ సింహాచలం గుర్తించారు. సత్రం జంక్షన్ నుంచి అడవివరం వెళ్లే రహదారిలో అశోక్‌నగర్ లే అవుట్ సమీపంలో రహదారి పక్కన తుప్పల్లో ఈ మృతదేహం లభించింది. అతని శరీరంపై నలుపు రంగు నిక్కరు, తెలుగు, నీలం రంగు గళ్లు కలిగిన షర్టు ఉంది. ముఖం గుర్తించలేని విధంగా పాడయిపోయింది. వీఆర్వో ఫిర్యాదు మేరకు ఆనందపురం సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్ఐ సంతోష్ సంఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల గ్రామాల్లో విచారించారు. మూడు రోజుల కిందట అతను అడవివరం వైపు నడుచుకుని వెళ్లినట్టు స్థానికంగా ఓ వ్యక్తి తెలిపాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి.. కేసు దర్యాప్తు చేస్తున్నారు.